రోడ్ల మార్జిన్లు ఇసుకమయం

- అధిక లోడుతో ఇసుక లారీలు, ట్రాక్టర్లు రయ్‌రయ్
- స్పీడ్ బ్రేకర్లు, గుంతల వద్ద జారిపడుతున్న ఇసుక
- ప్రమాదకరంగా వాహన చోదకుల రాకపోకలు
- పట్టించుకోని అధికారులు


కంకిపాడు అండర్‌పాస్ వద్ద రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక


ఈడుపుగల్లు-గోసాల నడుమ రోడ్డు మార్జిన్‌లో పేరుకుపోయిన ఇసుక

కంకిపాడు: పెనమలూరు నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక లారీలు, ట్రాక్టర్లు అధిక లోడుతో వెళుతున్నాయి. గుంతలు, స్పీడు బ్రేకర్లు, మలుపుల వద్ద వాహనాల కుదుపులకు ఇసుక జారి రోడ్లపై పడుతోంది. ఇలా పడిన ఇసుక మార్జిన్లలోకి చేరుకుని పేరుకుపోతోంది. రోడ్డు మార్జిన్లలోకి వెళ్లే వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పగలూ, రాత్రి తేడా లేకుండా రవాణా

నియోజకవర్గం పరిధిలోని కృష్ణానది ఏటిపాయ వెంబడి అనేక ఇసుక రీచ్‌లు ఉన్నాయి. రుతుపవనాల రీత్యా జూన్ నుంచి అక్టోబర్ 15 వరకూ ఇసుక రీచ్‌లలో తవ్వకాలను నిలుపుదల చేశారు. అయితే ఆయా రీచ్‌లలో ఉన్న స్టాక్ యార్డుల నుంచి ఇసుకను తరలించుకునే సదుపాయం కల్పించారు. దీంతో పెనమలూరు, కంకిపాడు మండలాల్లోని పలు ప్రాంతాల్లో నిల్వ చేసిన ఇసుక పగలూ, రాత్రీ తేడా లేకుండా రవాణా అవుతోంది.

నిబంధనలు బేఖాతరు

పరిమితికి మించి లారీలు, ట్రాక్టర్లలో ఇసుకను రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో నిబంధనలు పాటించడం లేదు. పైకప్పు మించి ఇసుకను లోడింగ్ చేసి సరఫరా చేస్తున్నారు. దీనికి తోడు ఆయా వాహనాలపై టార్పాలిన్‌లు, పరదాలు కప్పకుండానే రాకపోకలు సాగిస్తున్నారు. భారీ లోడుతో వస్తున్న వాహనాలు రోడ్లపై ఉన్న గుంతలు, స్పీడ్ బ్రేకర్లు, మలుపుల వద్ద మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తుండటంతో ఇసుక జారిపడుతోంది. విజయవాడ-మచిలీపట్నం హైవేపై రోడ్డు మార్జిన్లలో ఇసుక జారి మార్జిన్లు ఇసుకతో నిండిపోతున్నాయి. దీంతో అండర్‌పాస్‌లు, రోడ్డు మార్జిన్లు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు సుమారు 100కు పైగా ప్రమాదాలు కేవలం ఇసుక వల్ల జరిగినట్లు ప్రాథమిక అంచనా.

పట్టించుకోని అధికారులు

ఇసుకతో ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి ఇసుక లోడింగ్, రవాణా అవుతున్నా రవాణా శాఖ పట్టించుకోవడం లేదు. వాహనాలను తనిఖీలు చేసి సీజ్ చేసిన పరిస్థితులు లేవు. ఇసుక రవాణాపై నిఘా ఉంచాల్సిన రెవెన్యూ, పోలీసు శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఇసుక రవాణా వాహనాల యజమానులు ఇష్టానుసారంగా ఇసుకను లోడింగ్ చేసుకుని రవాణా సాగించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోయినా కిమ్మనకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక రవాణాపై నిఘా పటిష్టం చేయాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది.

ప్రమాదాలు అధికమవుతున్నాయి



పరిమితికి మించి ఇసుకను లోడింగ్ చేయడంతో రోడ్లపై ఎక్కడ చూసినా ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు రోడ్డు మార్జిన్లలో ఇసుక కారణంగా జారిపడి గాయపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రమాదాలు అధికమయ్యాయి. అధికారులు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

– గణపవరపు కాశిదాసు, ఈడుపుగల్లు

నిఘా కట్టుదిట్టం చేయాలి



ప్రధాన రహదారులు, వంతెన పరిసరాలపై అధికారులు నిఘాను పటిష్టం చేయాలి. పరిమితికి మించి ఇసుక భారీగా రవాణా అవుతోంది. ఉప్పులూరులో వంతెన శిథిలావస్థకు చేరుతోంది. ప్రజలు ఆందోళన చేస్తే వాహనాలపై నిఘా ఉంచారు. కానీ అడపాదడపా భారీ వాహనాలు ఇసుకతో రాకపోకలు సాగిస్తున్నాయి. ఊహించని ప్రమాదాలు జరగక ముందే అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఎస్. రామారావు, ఉప్పులూరు

క్లుప్తంగా

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



పెనమలూరు: డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఐఓ డాక్టర్ ప్రేమ్‌చంద్ అన్నారు. పెనమలూరులో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వాతావరణ మార్పులతో డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి, నాణ్యమైన మంచి నీరు మాత్రమే తాగాలన్నారు. ఈ సందర్భంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను చిన్నారులకు పంపిణీ చేశారు. డాక్టర్ బిజిలీ శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ లక్ష్మయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ఉయ్యూరు: ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులు దరిచేరవని న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ఉయ్యూరులోని మానికొండ భవన్‌లో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని ప్రజలు అలవర్చుకోవాలన్నారు. గ్రామీణ వైద్యులు ప్రజలకు మానవత్వంలో సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఉయ్యూరు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా తమ్మన ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా నాగబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వరరావు తదితరులతో కూడిన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమాన్ని సంఘ ప్రతినిధి నెల్లి రాంబాబు పర్యవేక్షించారు.

పొట్టిపాడు గ్రామంలో యోగాంధ్ర ర్యాలీ



పొట్టిపాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలో బుధవారం ఉషా రామ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న ఒక భూమి, ఒక ఆరోగ్యం థీమ్‌తో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం ప్రతిఒక్కరు నిత్యం యోగా చేయాలని సూచించారు. ఈ దిశగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించామని వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ వి. శ్రీహరి, మురళీకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సిందే

అతిక్రమిస్తే జరిమానా, లైసెన్సు రద్దు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): భక్తులకు విక్రయించే పూజా సామగ్రి, ఆట వస్తువుల ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సిందేనని దుర్గగుడి అధికారులు అల్టిమేటం జారీ చేశారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం మహా మండపం ఐదో అంతస్తులోని దుకాణాలను ఆలయ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దుకాణదారులకు పలు సూచనలు చేశారు. పూజా సామగ్రి విక్రయించే వారు తమ దుకాణాల ముందు ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, భక్తులకు అధిక ధరలకు పూజా సామగ్రిని విక్రయిస్తే తొలుత రూ. 10 వేలు జరిమానా, రెండో దఫా కూడా అదే విధంగా వ్యవహరిస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆలయ ప్రాంగణంలోని వివిధ కౌంటర్లు, పార్కింగ్‌తో దేవస్థానం ప్రతిష్ట దెబ్బతింటోందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రంగారావు, ఆలయ లీజెస్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయ స్వామికి అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేట విజయదుర్గా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలోని పంచముఖ ఆంజనేయస్వామి వారికి బుధవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. పూర్వాభద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, తమలపాకులతో అర్చన జరిగింది. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించగా పెద్ద ఎత్తున భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్లు అందజేత



కంకిపాడు: యాంత్రీకరణపై రైతులు దృష్టి సారించాలి ఏఎంసీ చైర్మన్ అన్నే ధన రామకోటేశ్వరరావు (ధనయ్య) అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో 80 శాతం రాయితీపై కోలవెన్నుకు చెందిన విఘ్నేశ్వర కిసాన్ గ్రూప్, మద్దూరు గ్రామానికి చెందిన కిసాన్ డ్రోన్స్ ప్రతినిధులకు బుధవారం డ్రోన్‌లను పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య మాట్లాడుతూ డ్రోన్ వాడకం వల్ల కూలీ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. వ్యవసాయ పెట్టుబడుల నుంచి ఉపశమనం లభిస్తుందని చెప్పారు. రాయితీపై ఇచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కల్యాణి, బోడె వెంకటరామ్, పామర్రు ఏడీ స్వర్ణలత, డైరెక్టర్ గోగినేని రమణ, నాయకులు అనుమోలు ప్రభాకర్‌రావు, పులి కామేశ్వరరావు, సుదిమళ్ల రవీంద్ర, చలవాది రాజా పాల్గొన్నారు.

విజయవాడ-విశాఖపట్నం ప్రయాణికులకు రాయితీ

బస్టాండ్(విజయవాడపశ్చిమ): విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే అమరావతి ఏసీ బస్సుల్లో ఈ నెల 26 నుంచి జూలై 24 వరకు టిక్కెట్ చార్జీలలో పది శాతం రాయితీ కల్పిస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.వై దానం ఒక ప్రకటలో తెలిపారు. విజయవాడ-విశాఖపట్నం మధ్య సాధారణ చార్జీలు రూ. 1,070 ఉండగా పది శాతం రాయితీతో రూ. 970కే ప్రయాణించవచ్చన్నారు. ఈ చార్జీలు రాను, పోను టిక్కెట్లు ఒకేసారి రిజర్వు చేసుకునే ప్రయాణికులకు మాత్రమే వర్తిస్తుందన్నారు.

కొత్త కమిషనర్ ఎక్కడ?

- బదిలీ జరిగి 10 రోజులు
- విధుల్లో చేరని తాడిగడప మున్సిపల్ కమిషనర్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీకి కొత్త కమిషనర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి పది రోజులైనా ఇప్పటివరకు కొత్త కమిషనర్ విధుల్లో చేరలేదు. కమిషనర్ పోస్టుపై అనేక పైరవీలు జరగగా చివరకు ఏపీ సచివాలయంలో జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న షేక్ నజీర్‌ని కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఇక్కడ కమిషనర్‌గా ఉన్న భవానీ ప్రసాద్‌ను కమిషనర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో రిపోర్టు చేయమన్నారు. అయితే కొత్త కమిషనర్ ఫారన్ సర్వీస్‌లో ఉన్నందున పేరెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. కొత్త కమిషనర్ విధుల్లో చేరకపోవడంపై స్థానికంగా చర్చ జరుగుతోంది. అసలు ఆయన వస్తారా.. రారా అని సిబ్బంది చర్చించుకుంటున్నారు.

సంతకాలపై దుమారం

కాగా కొత్త కమిషనర్ వచ్చే లోగా తాడిగడప మున్సిపాలిటీలో పేరుకుపోయిన ఫైల్స్‌పై ప్రస్తుత కమిషనర్ సంతకాలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా కాంట్రాక్టర్లకు సుమారు రూ. 2 కోట్ల బిల్లులకు క్లియరెన్స్ ఇచ్చినట్లు చెబుతున్నారు. అలాగే గతంలో వివాదాలలో ఉన్న నాన్ లే అవుటు ప్లాన్లు, గ్రూప్ హౌస్ ప్లాన్లు, పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌పై చకచకా సంతకాలు జరుగుతున్నాయని సిబ్బంది గుసగుసలాడుతున్నారు. అక్రమ లే అవుట్లపై సంతకాలు జరిగితే భవిష్యత్‌లో మరో కొత్త వివాదానికి తెరలేచే అవకాశం ఉంది. ప్రస్తుతం తాడిగడప మున్సిపాలిటీలో వ్యవహారం అత్యంత గోప్యంగా ఉంటోంది. సంతకాల వ్యవహారం కారణంగానే కొత్త కమిషనర్ జాప్యం చేస్తున్నారా లేక ఆయనకు పేరెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతి రాలేదా అనేది తేలాల్సి ఉంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విధ్వంసకర పాలన

ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ధ్వజం



గన్నవరం: రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో విధ్వంసకర పాలనను కూటమి ప్రభుత్వం సాగిస్తోందని ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ధ్వజమెత్తారు. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను స్థానిక ఆగిరిపల్లి-గన్నవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ కోసం ధ్వంసం చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. తొలగించిన విగ్రహాలను బుధవారం పరిశీలించిన అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలను ఆర్పించిన మహనీయుల విగ్రహాలను అభివృద్ధి మాటున తొలగించి చెత్తకుప్పల్లో పడవేయడం దారుణమన్నారు. ముందుగా కాంగ్రెస్ ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా, పంచాయతీ తీర్మానం లేకుండా విగ్రహాలను తొలగించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలో అక్రమ అరెస్టులు, విధ్వంసాలు, దౌర్జన్యాలతో పాలన సాగుతోందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసగిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. రోడ్డు విస్తరణ నిమిత్తం రెండు నెలలుగా వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా తొలగించిన విగ్రహాలను తిరిగి ఎక్కడ ఏర్పాటు చేస్తారో లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పక్కా ప్రణాళికతో విద్యాబోధన

డీఈఓ రామారావు


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ పీవీజే రామారావు

ఉయ్యూరు: ప్రణాళికాయుతంగా విద్యా బోధన చేసి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా శాఖాధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఆరో తరగతిలో చేరే విద్యార్థులకు 40 రోజులు బ్రిడ్జి కోర్సులు నిర్వహించి సన్నద్ధులను చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందించడంతో విద్యార్థులు ఇష్టంగా భోజనం చేస్తున్నారన్నారు. డీవైఈఓ పద్మారాణి, హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు వైఎస్‌ఎన్ ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి జాకీర్ హుస్సేన్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీనివాస్, ఉయ్యూరు హెచ్‌ఎం నాగేశ్వరరావు, పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గూగుల్‌తో సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఒప్పందం


ఒప్పందం చేసుకుంటున్న గూగుల్, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రతినిధులు

పెనమలూరు: అంతర్జాతీయ బహుళ జాతి దిగ్గజం గూగుల్‌తో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ సాంకేతిక విద్యా బోధనకు ఒప్పందం (ఎంఓయూ) చేసుకుంది. కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో గూగుల్ రీజినల్ హెడ్ ఎడ్యుకేషన్ అండ్ ఎడెక్స్ సిద్ధార్థ్ దల్వాడీ, గూగుల్ వర్క్‌స్పేస్ రీజినల్ హెడ్ కరన్‌తల్వార్, హినోటిక్ టెక్నాలజీ సీఈఓ బి.మల్లేషు, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా గూగుల్ విద్యార్థులకు గ్లోబల్ టెక్ టెండ్స్, రిమోట్ లెర్నింగ్, కెరీర్ మార్గదర్శకాలు, గూగుల్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు, సంయుక్త ప్రాజెక్టులు, టెక్ ఇంక్యుబేటర్లు ఏర్పాటు చేస్తారని వివరించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజయ్య, పాలడుగు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవు

రామవరప్పాడు: నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ప్రమాదకరంగా మారిన ఖాళీ స్థలాలను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామంలో నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్త పడవేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. ఖాళీ స్థలాల్లో చెత్త డంప్ చేయడం వల్ల పారిశుద్ధ్య సమస్యలతో పాటు పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మురుగు, వ్యర్థాలు పేరుకుపోయి దోమలు, విష పురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయని చెప్పారు. వీటి సమస్య పరిష్కరించేందుకు ఖాళీ స్థల యజమానులను గుర్తించి శుభ్రం చేయించుకుని మెరక తోలించుకోవాల్సిందిగా ఆదేశిస్తామన్నారు.

వసూళ్లపై ఉన్న శ్రద్ధ నిర్వహణలోనూ చూపించాలి

సీపీఎం ఫ్లోర్ లీడర్ సత్యబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గ్రంథాలయాల సెస్ వసూళ్లపై ఉన్న శ్రద్ధను వాటి నిర్వహణలోనూ చూపాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అన్నారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని నాలుగు స్తంభాల సెంటర్ కొండ ప్రాంతంలో సీపీఎం బృందం బుధవారం పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుంది. వడ్డెరవారి వీధిలోని నగర పాలక సంస్థకు చెందిన గ్రంథాలయం మూసివేసి ఉండటాన్ని చూసి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని నెలలుగా గ్రంథాలయం మూసివేయడంపై సత్యబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పదిమందికి విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయ నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా పేదలు నివసించే ప్రాంతాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాల్సిన నగర పాలక సంస్థ ఉన్న వాటిపై కూడా దృష్టి సారించకపోతే ఎలా అని ప్రశ్నించారు. మూసివేసిన గ్రంథాలయాన్ని వెంటనే తెరిపించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. పర్యటనలో భాగంగా పలుచోట్ల వాటర్ పైప్‌లైన్లు లీకేజీ అయ్యి మంచి నీరు వృథాగా పోవటాన్ని గమనించారు. లీకేజీ కారణంగా నెల రోజులుగా తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో బైక్‌లు స్కిడ్ అయ్యి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి లీకేజీలను అరికట్టాలని కోరారు. డివిజన్ కార్యదర్శి ఆర్. మోహన్, పుల్లారావు, బి. సుదర్శన్, వెంకటేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల చుట్టూ పేరెంట్స్ ప్రదక్షిణలు

తల్లికి వందనం సొమ్ములు పడక ఆందోళన


నున్న సచివాలయంలో వెరిఫికేషన్ చేయించుకుంటున్న పేరెంట్స్

విజయవాడరూరల్: తల్లికి వందనం పథకంలో బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ కాక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమ పిల్లలకు డబ్బులు ఎందుకు రాలేదో తెలియక ఎంఈఓ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు నోరు మెదపడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద డబ్బులొచ్చాయని, ఇప్పుడు ఎందుకు రాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ సచివాలయాల్లో సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన సమాచారం రాలేదని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం డబ్బులు వస్తాయని ఎన్నికల ముందు ఎందుకు హామీ ఇవ్వడం అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్హత ఉన్నా తిరస్కారం..

అర్హత ఉన్న పేదవారికి కూడా ఇన్‌కం సర్టిఫికెట్ లేదని దరఖాస్తులను ఇన్ వ్యాలిడ్ కింద తిరస్కరిస్తున్నారు. విజయవాడ రూరల్ మండలంలో ఆ విధంగా 2,500 దరఖాస్తులను తిరస్కరించినట్లు ప్రాథమిక లెక్కలు చెబుతున్నాయి. వారందరూ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సచివాలయాల్లో సిబ్బంది చెబుతున్నా.. అధికారులు ఎవ్వరూ నోరుమెదపడం లేదు.

పచ్చిరొట్ట పైర్లతో భూసారం పెంపు

ఏఓ రమేష్


పచ్చిరొట్ట పైరును పరిశీలిస్తున్న అధికారులు

ఆత్కూరు(గన్నవరం): మండలంలోని ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పచ్చిరొట్ట పైర్లను మండల వ్యవసాయ అధికారి జి. రమేష్, ఉద్యాన శాఖాధికారి చంద్, ఏఈఓ నాగేశ్వరరావు పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రమేష్ మాట్లాడుతూ నారుమడుల్లో కలుపు నివారణకు రైతులు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. భూసారాన్ని కాపాడుకునేందుకు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని చెప్పారు. పచ్చిరొట్ట పైర్లు అయిన జీలుగ, పిల్లి, పెసర సాగు చేయాలని సూచించారు. చంద్ మాట్లాడుతూ రెతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలని, ఉద్యాన పంటలు సాగుచేయాలని చెప్పారు. ప్రస్తుతం దిగుబడులు అధికంగా వచ్చే ఆయిల్‌పామ్ పంట సాగు లాభసాటిగా ఉందన్నారు. వీఏఏలు రమాదేవి, రాణి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పూరి జగన్నాథ రథయాత్రకు ప్రత్యేక బస్సులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఈ నెల 27న జరుగనున్న పూరి జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై దానం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బస్సులు ఈ నెల 25న ఉదయం విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి అదే రోజు అన్నవరం, సింహాచలం, విశాఖపట్నం ఆర్‌కే బీచ్ సందర్శన అనంతరం సాయంత్రం బయలుదేరి, కోణార్క్ సూర్య దేవాలయం చేరుకుంటుందన్నారు. అక్కడ కోణార్క్ దర్శనం, శ్రీపూరి జగన్నాథుని దర్శనం, రథయాత్ర పూర్తి చేసుకున్న అనంతరం తిరుగు ప్రయాణం చేసి 28న రాత్రి 7 గంటలకు విజయవాడ చేరుకుంటుందని చెప్పారు. ఈ యాత్రలో సూపర్ లగ్జరీ (హైటెక్), ఇంద్ర ఏసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. సూపర్ లగ్జరీకి ఒక్కొక్కరికి రూ. 3,600, ఇంద్ర ఏసీ బస్సులకు ఒక్కొక్కరికి రూ. 4,800 చార్జీ వసూలు చేస్తామని చెప్పారు. ఆసక్తిగల వారు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లో కానీ, సమీప బస్‌స్టేషన్‌లో కానీ, ఆర్టీసీ అధీకృత టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద కానీ టిక్కెట్లు పొందవచ్చని తెలిపారు. ఈ యాత్రకు కనీసం 30 మంది సమూహంగా వెళ్లదలుచుకుంటే విజయవాడలోని వారి నివాస ప్రాంతం నుంచే బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఇతర వివరాలకు సెల్: 80742 98487, 95158 60465 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హైస్కూల్‌లో ప్రవేశాలపై అవగాహన ర్యాలీ



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): చదువుకి దూరమైన పిల్లలు బడిబాట పట్టేలా అవగాహన కల్పించేందుకు కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం 'రండి మా స్కూల్లో చేరండి' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు తొలుత పాఠశాలలో అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బ్రాహ్మణ వీధి, చిట్టినగర్ అడ్డరోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికి కరపత్రాలు పంచిపెట్టి చదువుకుంటే వచ్చే ఫలితాల గురించి వివరించారు. పాఠశాలలో విద్యార్థులు సాధిస్తున్న అత్యుత్తమ ఫలితాలు, క్రీడలు, ఎన్‌సీసీ, ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలను వివరించారు. బడి బయట ఉన్న పిల్లలందరిని బడిలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు యు.వెంకటేశ్వరరావు, జె.ఆనంద కుమార్, కె. శ్రీనివాస్, డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, ఎస్. శ్రీనివాసరావు, శశికళ, కె.కృష్ణ, ఉపాధ్యాయుల ప్రతినిధి బి.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.